సమీక్ష







సీఎం చంద్రబాబుతో సమీక్షలో పాల్గొన్న మంత్రులు నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, చిర్రి బాలరాజు, బత్తుల బలరామకృష్ణ, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకట్రాజు, బడేటి చంటి, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లు పి.ప్రశాంతి, వెట్రి సెల్వి, ఇరిగేషన్ ముఖ్య అధికారులు

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



ఫొటో ఎగ్జిబిషన్‌ను చూస్తున్న సీఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు ఒక ఐకాన్

సమస్య తీరాలి.. పనులు జరగాలి

- ఎక్కడా జాప్యానికి తావు ఇవ్వకండి
- కాల వ్యవధి కంటే ముందుగానే పనులు కావాలి
- ఆర్‌అండ్‌ఆర్ కోసం ఐఏఎస్ అధికారి నియామకం
- పోలవరం పనుల సమీక్షలో సీఎం చంద్రబాబు

- డయాఫ్రంవాల్ నిర్మాణంతోపాటు సమాంతరంగా ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణానికి అనువైన మార్గం ఉంది. ఆ దిశగా ఏర్పాట్లు చేసుకోవాలి. తగినంత మెటీరియల్ సమకూర్చుకోవాలి.
- వచ్చే ఏడాది జనవరి 2వ తేదీ నుంచి డయా ఫ్రం వాల్ నిర్మాణం పనులు చేపట్టి వేగం పెంచాలి.
- 2026 మార్చి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా 2025 డిసెంబరు నాటికే పూర్తి చేయాలి.
- టన్నెల్స్ నిర్మాణ పనులు 2026 ఫిబ్రవరిలోపు పూర్తి కావాలి.
- కుడికాలువ కనెక్టివిటి 2026 డిసెంబరులోపే జరగాలి. ఈలోపు కావాల్సిన సహకారాలను ముందుగానే అందిపుచ్చుకోవాలి.

\- సీఎం చంద్రబాబునాయుడు

ఏలూరు/పోలవరం, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయబోతున్నందున ఈలోపే ఆర్‌అండ్‌ఆర్ పనులను పూర్తిచేయాలి. ఎక్కడిక క్కడ ముందే సమీక్షించుకుని పనులన్నీ సిద్ధం చేయాలి' అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను సోమ వారం ఆయన పరిశీలించిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో అర గంటకుపైగా సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '2026 జూన్ 26వ తేదీ నాటికల్లా భూసేకరణకు పనులు పూర్తిచేయాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై గిరిజనులు, గిరిజనేతరులు ఎన్నో ఆశలు పెట్టుకు న్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లోవున్న వాటిని పరిష్కరించాలి. ఈ క్రమంలోనే వీటిని చక్కదిద్దేం దుకు అవసరమైన డిప్యూటీ తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లతోపాటు ఒక ఐఏఎస్ అధికారిని నియమించాల్సిన ప్రతిపాదన ఉంది. దీనిని పరిశీలిస్తున్నాం. యుద్ధప్రాతిపదిన పనులను వేగ వంతం చేయాలి. లక్ష్యాలను చేధించే క్రమంలో పోలవరం ప్రాజెక్టును ఒక ఐకానిక్ ప్రాజెక్టుగా ప్రత్యేక గుర్తింపు తీసుకువాలి. అందుకనుగుణం గా పనులు పూర్తిచేయాలి. పనుల విషయంలో, పునరావాస తదితర అంశాలను సుప్రీంకోర్టు ఆదే శాల మేరకు పోలవరం ప్రాజెక్టు పనులు చేపట్టా లి. పోలవరం కోసం ఎంతో తపన చెందాను. రేయింబవళ్లు పనులు పూర్తి చేసేందుకు ఆరాట పడ్డా. నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను ముందుగా ఆదుకోవాలి. వచ్చే సమావేశంలో పనుల పురోగతి, ప్రణాళిక అంశాలపై సమీక్షిస్తా. మైలురాళ్లు చేరుకునేలా సాంకేతికపరమైన అంశా లను గుర్తించి అడుగులు వేయాలి. ఇ.సి.ఆర్. ఎఫ్., డయాఫ్రమ్ వాల్ పనులను సమాంతరం చేపట్టాలి' అని అన్నారు. ఇ.సి.ఆర్.ఎఫ్ గ్యాప్-1 డిసెంబరు 24 నుంచి ఫిబ్రవరి 26 నాటికి పూర్తి చేస్తామనగా, డిసెంబరు 25 నాటికి పూర్తి చేయా లని సీఎం అధికారులను ఆదేశించారు. గ్యాప్ - 2 పనులు డిసెంబరు 27 నాటికి బదులు ముందే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర అనుబంధ పనులను సమాంతరం నిర్వ హిస్తూ, యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయా లి. కుడి కాలువ, ఎడమ కాలువను అనుసంధా నం చేసే పనులను పూర్తిచేయాలి. అందుకనుగు ణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పనులు పూర్తిచేయాలి. మెటీరియల్, ట్రయిల్ రన్, సామగ్రి తరలింపు అంశాలపై నిర్దిష్ట కార్యా చరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో పెట్టడానికి అధికారులు, కాంట్రాక్టర్లు కట్టుబడి ఉండాలి. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చెందిన పనులు, పనుల పురోగతి, సంబంధించిన వివరాలు, పీపీ టీ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. సాంకేతికపరమైన అంశాలతో కూడిన నివేదికను సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రికి అందించారు.



పోలవరం ప్రాజెక్టు ఫొటో తీస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



పోలవరం ప్రాజెక్టులో జరుగుతున్న పనుల తీరును చూపిస్తున్న సీఎం చంద్రబాబు

2027 నాటికి పూర్తి చేస్తాం

నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల

'తమ ప్రభుత్వ హయాంలో 78 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే.. వైసీపీ నిర్వాకం వల్ల 30 శాతం విధ్వంసా నికి గురై వెనక్కిపోయింది' అని రాష్ట్ర భారీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు విమర్శించారు. ప్రాజెక్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నాలు గు నెలల కాలంలో సీఎం చంద్రబాబు 12సార్లు వర్చువల్‌గా, ఒకసారి ప్రత్యక్ష పర్యవేక్షణతో ప్రాజెక్టు పనులు ముందుకు నడిపిస్తున్నారు. 2027 నాటికి పోలవరం పూర్తిచేసే లక్ష్యంతో పనులు సమీక్షిస్తున్నా రు. నూతన డయా ఫ్రం వాల్ నిర్మిస్తూనే.. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణ పనులు చేసేలా చర్యలు తీసుకోవడానికి అధికారు లతో సమావేశం నిర్వహించారు. 2018లో చంద్రబాబు 18 నెలలు కష్టపడి రూ.400 కోట్లతో డయా ఫ్రం వాల్ నిర్మించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎర్త్ కం రాక్ ఫిల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారం భించకుండా రివర్స్ టెండరింగ్, అధికారుల బదిలీల పేరిట 13 నెలల కాలయాపన కారణంగా వరదలకు డయా ఫ్రం వాల్ దెబ్బతింది. భారీ అగాధాలు ఏర్పడి ఇసుక తో పూడ్చాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అప్పుడే నిర్మించి వుంటే 2021 నాటికే అది పూర్తయ్యేది' అని నిమ్మల వివరించారు.

సీఎం చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 11.45 గంటలకు ప్రత్యేక హెలి కాప్టర్‌లో పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నా రు. తొలుత ఏరియల్ సర్వేచేశారు. 11.55 గంటలకు హెలీప్యాడ్ ప్రాంతానికి వచ్చారు. సీఎంకు మంత్రులు నిమ్మల రామానాయు డు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహ ర్, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్, డాక్టర్ కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, కొలికపూడి శ్రీనివా సరావు, పితాని సత్యన్నారాయణ, బడేటి రాధాకృష్ణయ్య, బత్తుల బలరామకృష్ణ, మిరియాల శిరీషాదేవి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, అంగర రామ్మోహన్, కొత్తపల్లి సుబ్బారాయుడు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, సీఈ నరసింహ మూర్తి సలహాదారులు, ఇరిగేషన్ ఇంజనీర్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు వెట్రిసెల్వి, పి.ప్రశాంతి, డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రశాంత్ శివకిషోర్, జేసీ ధాత్రి రెడ్డి, మేఘా డైరెక్టర్ సీహెచ్ సుబ్బయ్య, ఏఎస్ దినేష్‌కుమార్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, పీఐసీఫ్ ఇంజనీర్ కె.నరసింహారెడ్డి, రాంబాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్, పీపీఏ మెంబరు సెక్రటరీ ఎం.రఘురామ్, మెయిల్ సీవో ఎ.సతీష్‌బాబు, మేసర్స్ బేయర్ మ్యాక్స్ పీవో ఐటీడీఏ పీఏ అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కె.కల్పశ్రీ తదితరులు పూల బొకేలతో స్వాగతం పలికారు. హిల్‌వ్యూ ప్రాంతం నుంచి సీఎం ప్రాజెక్టు స్పిల్వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్ ప్రాంతాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలిం చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి గ్యాప్ 1, 2 ప్రాంతా లు, డయా ఫ్రం వాల్ ప్లాట్ ఫాం నిర్మాణపు పనులు పరిశీలించారు. 1.23 గంటలకు ప్రాజెక్టు కార్యాలయంలో మంత్రులు, ఇంజనీ రింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 3.06 గంటలకు హెలికాప్ట ర్‌పై తాడేపల్లి బయల్దేరివెళ్లారు.

పరిశీలన







పోలవరం ప్రాజెక్టు వద్ద సీఎం చంద్రబాబు పనుల పరిశీలన



టి.నరసాపురంలో చలిమంట

చలి పంజా!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చలి పంజా విసురుతోంది. గత నాలుగు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడి పోయాయి. జనం చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఇటీవల వరుస అల్పపీడనాల కారణంగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ పేర్కొంది. 7

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో.. ప్రత్యేక ఆధార్ క్యాంపులు

జడ్పీ సీఈవో విజయరాజు

ఏలూరుసిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నూతన ఆధార్ కార్డులు, గుర్తించిన లోపాలు సరి చేయడానికి డిసెంబరు మూడు, నాలుగు వారాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ సీఈవో, గ్రామ సచివాలయాలు/ వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఆర్.విజయరాజు తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపు రెండో విడత ఈనెల 26వ తేదీ నుంచి 28 వతేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగు తుందన్నారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వ హించాల్సిందిగా జిల్లాలోని 27 మండలాల ఎంపీడీ వోలకు, నాలుగు మునిసిపాలిటీల కమిషనర్‌లకు ఆధార్ కార్డుల నమోదుపై ప్రత్యేక సూచనలు జారీ చేశారు. జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు నూతన ఆధార్ కార్డులు అంద జేయడం, గతంలో నమోదు చేయబడిన ఆధార్ కార్డులలో లోపాలను సరిచేయడం, అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపుల నిర్వహణ సక్రమంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో 0-6 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆధార్ కార్డు నమోదు చేయడా నికి గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్-6) / డిజిటల్ అసిస్టెంట్, వార్డు సచివాల యంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్ర రీని విధులు నిర్వహించాల్సిందిగా ఆయన ఆదేశిం చారు. జిల్లాలోని మండల పరిషత్ అధికారులు/ మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో గల అంగన్ వాడీ కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపుల నిర్వహణ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

196 అర్జీల పరిష్కారం : జేసీ

ఏలూరుసిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంతవరకు నిర్వహించిన 132 రెవెన్యూ సదస్సులకు 6,558 మంది హాజరై 1613 అర్జీలు ఇవ్వగా వాటిలో అక్కడికక్కడే 196 అర్జీలు పరిష్క రించినట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో భూసమస్యలే పరిష్కారమే లక్ష్యంగా మీ భూమి.. మీహక్కు పేరుతో నిర్వ హిస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జేసీ సోమవారం వివరాలు తెలిపారు. జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలుండగా ఇంతవరకు 132 గ్రామాల్లో రెవె న్యూ సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. సోమ వారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సుల్లో 824 మంది పాల్గొని ఆయా సమస్యలపై 326 అర్జీలను అందజేశారని, వాటిలో 15 దరఖాస్తులను అక్కడి కక్కడే పరిష్కరించారన్నారు. సదస్సుల్లో అందిన విజ్ఞప్తులను 45 రోజుల్లోగా పరిష్కరిస్తారన్నారు. సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధి కారిగా నియమించినట్టు తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే ఈ సదస్సుల్లో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబంధించిన సమ స్యలను తెలిపి పరిష్కారం పొందాలన్నారు.



ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

నేటి నుంచి శ్రీవారి తిరువీధి సేవలు 6

ఎర్రకాల్వ.. కడగండ్లు..!

నేటికీ వీడని ఎర్రకాల్వ వరదల విలయం.. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు 7



దోమలు బాబోయ్..

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో దోమల దెబ్బకు రోగులు భయపడిపోతున్నారు. నిత్యం ఫ్యాన్‌లు తిరుగుతున్నా దోమలు మాత్రం వాటి ప్రతాపాన్ని రోగులపై చూపుతున్నాయి. ఒక పక్క గర్భిణులు మరోపక్క దోమల దెబ్బకు ఆసుపత్రి పాలైనవారి వరకూ ఈ దోమలు భయపెడుతున్నాయి. ఇటీవల జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఈ ఆసుపత్రి వద్ద రోగులు దోమల దెబ్బకు హడలెత్తిపోతున్నారు. మరో పక్క ఆసుపత్రి వద్ద బెడ్‌ల నుంచి కొబ్బరి పీచు బయట పడి రోగులు పడుకు నేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంతో పోలిస్తే ఇన్‌పేషెంట్‌లు తక్కు వగా ఉండటం వల్ల ఒక ప్రసూతి వార్డు తప్ప మిగిలిన వార్డుల్లో మంచాలు ఖాళీగా ఉంటున్నాయి.

సాయంత్రం అయితే ఉండలేం

ఎం.గంగాభవాని, తాడేపల్లిగూడెం



ఆసుపత్రిలో సాయంత్రం అయిందంటే ఉండలేకపోతున్నాం. మా చెల్లి ప్రసూతి వార్డులో మూడు రోజుల క్రితం అడ్మిట్ అయింది. వార్డులో ఫ్యాన్‌లు తిరుగుతున్నా దోమలు వదలడం లేదు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.



తణుకు ఆసుపత్రిలో నీరు నిలిచి దుర్గంధం

పారిశుధ్యం చర్యలు ఏవీ

తణుకు : తణుకు ఆసుపత్రిలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడ చూసినా నీటి నిల్వలు నాచు పట్టి దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో గర్భిణులు సైతం కూర్చోవడానికి కుర్చీలు లేని పరిస్థితి. గర్భిణుల ఓపీ విభాగం వద్ద తుప్పు పట్టిన కుర్చీలను ఒకదానిపై ఒకటి పెట్టి నిరుపయోగంగా ఉంచారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు నిర్వహణ సరిగా లేకపోవడంతో రెండు వాహనాలు మూలకు చేరాయి. ఆసుపత్రికి సంబంధించి మొత్తం ఐదు వాహనాలు ఉండగా ముగ్గురు మాత్రమే పైలెట్లు ఉన్నారు. వారికి జీతాలు సరిగా ఇవ్వకపోవడం, వాహనాలకు సరైన మెయింటినెన్స్ లేకపోవడంతో విధులకు దూరంగా ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోగంతో ఆసుపత్రికి వస్తే అక్కడ సమస్యలు ఇంకా ఇబ్బంది పెడుతున్నాయి. రాత్రయితే దోమలతో యుద్ధం చేయడమే సరిపోతుంది. ఫ్యాన్లు ఉన్నా తిరగవు.. కొన్ని ఆసుపత్రుల్లో మరుగుదొడ్ల నిర్వహణ లేక కంపుకొడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ఆస్పత్రులను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా పలు సమస్యలు బయటపడ్డాయి. రోగులు తమ ఇబ్బందులను చెప్పారు..



ఏలూరు ఆసుపత్రి..

నరకం చూస్తున్నాం..!

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అసౌకర్యాలు
రాత్రయితే దోమల దాడి
ఫ్యాన్లు ఉన్నా తిరగవు
అపరిశుభ్రతతో అవస్థలు
సమయానికి రాని వైద్యులు..
రోగులకు తప్పని పాట్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):అసలే శీతా కాలం.. గజగజలాడే చలి.. అనారోగ్యాలతో ఆసుపత్రి పాల య్యారంటే ఒక్క గంట హాయిగా నిద్రపడితే ఒట్టు. ఏలూరులో సర్వజన ఆసుపత్రిలో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి అయిందంటే రోగులు మంచం వద్ద దోమల రాకుండా అగరత్తులను వెలిగించుకోవాలి. బ్యాట్‌లతో దోమలను చంపుకోవాల్సిందే. ఆసుపత్రిలో చేరిన రోగులు తమ రోగ బాధకన్నా ఇక్కడ దోమలు బాధ భరించలేక త్వరగా డిశ్చార్జి చేయండి మహాప్రభూ అంటూ వైద్యులను వేడుకుంటున్నారు. కిటికీలకు దోమలు రాకుండా మెష్‌లు పెట్టాల్సి ఉన్నా ఎక్కడా అవి కానరావడం లేదు. డ్రైయిన్ల వెంబడి మలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయాల్సి ఉన్నా ఇవి ఎక్కడా చేయడం లేదు. దోమలను, ఎలకలను, క్రిమి కీటకాలను నిర్మూలించడానికి నెలకు లక్షలాది రూపాయలను కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం దారపోస్తుంది. సక్రమంగా అమలయ్యేలా చూడడంలో ఆసుపత్రి అధికారులు వైఫల్యం చెందుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఏలూరు ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉన్న రెండు గంటల్లో దోమ కాటున బారినపడ్డారు. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిపించి వెంటనే దోమల నిర్మూలనకు ప్రతి రోజు ఫాగింగ్ చేయాలని అధికారులు ఆదేశించారు. ఒక్క రోజు మాత్రమే ఫాగింగ్ చేశారు. మళ్ళీ ఇప్పటి వరకూ ఫాగింగ్ చేయలేదు. ఆసుపత్రికి అటెండెంట్‌గా వచ్చిన వారి పరిస్థితి మరీ ఘోరం. గతంలో వైద్య విధానపరిషత్ ఆసుపత్రిగా ఉన్న కాలంలో 15 లక్షల వ్యయంతో ఒక విశాలమైన షెడ్డును వీరికోసం తయారు చేయగా అటెండెంట్లు ఆ షెడ్డులో రాత్రి వేళ బస చేసేవారు. మెడికల్ కాలేజీ వచ్చిన తరువాత ప్రస్తుతం ఆ షెడ్డును రీమోడలింగ్ చేసి విద్యార్థుల రెండో సంవత్సరం తరగతి గదిగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రోగి సహాయకులు ఆసుపత్రిలో ఎక్కడ కొంచెం జాగా కనిపిస్తే అక్కడ తలవాలుస్తున్నారు. రోగుల సహాయకుల కోసం షెడ్డును నిర్మించాల్సి ఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్ షెడ్డుని నియమించాలని ఆదేశాలు ఇచ్చిన ప్పటికీ ఆ పనులు మొదలు పెట్టిన దాఖలాలు కానరాలేదు. ఆసుపత్రిలో ఉన్న మంచాలు పాతబడిపోవడంతో ఇటీవల 100 సాధారణ పడకలు, మరో 25 హైడ్రాలిక్ మంచాలను ఒక సంస్థ బహూకరించారు. దీంతో ఆసుపత్రిలో మంచాల కొరత తీరింది. బెడ్‌షీట్లను ప్రతి రోజు మార్చాల్సి ఉన్నా మార్చడం లేదు. తమ ఇళ్ళ నుంచి తెచ్చుకున్న బెడ్‌షీట్లను వినియోగించుకుంటున్నారు.



ఏలూరులో దోమలు రాకుండా వెలిగించిన అగర్‌బత్తీ



కనీస వసతులు కరువు

పెనుగొండ : సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఉన్నాయి. ఆదివారం వైద్యులు రారు. ఏదైనా అత్యవసరమైతే స్థానికంగా ఉన్న వైద్యులు వస్తారని చెబుతారు. ఆసుపత్రిలో మూడు బెడ్లు మాత్రమే ఉన్నాయి. వైద్యులు కూడా సకాలంలో రారని, సాయంత్రం 4 అయితే వెళ్ళిపోతారని రోగులు చెబుతున్నారు. అత్యవసరమైన వారు ఈ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తే పెనుగొండ, తణుకు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లమని చెబుతున్నారు. రోగులు రాకపోవడంతో ఉన్న మూడు బెడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పెనుగొండ సీహెచ్‌సీలో ఎండీ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల రోగులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. గాయాలు పాలై ఆసుపత్రికి వచ్చిన వారికి కట్లు కట్టే వారు లేని దుస్థితి ఏర్పడింది.

అద్దె భవనంలో అవస్థలు

ఆకివీడు : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇరుకు గదుల్లో సతమత మవుతున్నారు. లాంచీలరేవుకు వెళ్ళే సమీపంలో అద్దె భవనంలో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. రెండు బెడ్‌లపై వైద్య సేవలందించాల్సి ఉండగా వసతి లేకపోవడంతో ఒక బెడ్‌పైనే సేవలందిస్తునానరు. స్టాఫ్ నర్సు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమతా నగర్ రోడ్‌లో నూతన భవనం నిర్మాణం కొనసాగుతుంది. గత ప్రభుత్వంలో ఈ భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కూటమి ప్రభుత్వం పనులు చేయించింది. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది.నూతన భవనంలో పది బెడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందుతుంది.



స్టాండ్ ఫ్యాన్ ఉండాల్సిందే..

భీమవరం క్రైం : భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమస్యలకు నిలయంగా మారింది. జిల్లా కేంద్రంలో ఉన్నా 50 పడకల ఆస్పత్రిగానే కొనసాగుతుంది. 100 పడకల ఆస్పత్రి కోసం ఎంతో మంది కృషి చేసినా ఫలితం లేదు. గత ప్రభుత్వంలో గొల్లవానితిప్ప రోడ్డులో ఆస్పత్రి నిర్మాణాలు ప్రారంభించారు. కానీ అవి పనులు సాగడం లేదు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిలో 2014 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ భవనానికి రూ.7 కోట్లు, పరికరాలకు రూ.2 కోట్లు మంజూరు చెయ్యడంతో నూతన భవనం ఏర్పాటైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఆస్పత్రిలో రోగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. రోజుకు ఆస్పత్రికి 200 మంది వైద్యం కోసం వస్తుంటారు. అలాగే నెలకు 30 వరకు ప్రసవాలు జరుగుతాయి. అయితే ఆస్పత్రిలో ఫ్యాన్‌లు ఉన్నా సరైన గాలి రాకపోవడంతో ఇంటి నుంచి తప్పనిసరిగా ఫ్యాన్‌లు తెచ్చుకోవలసిందే. విరిగిన మంచాలకు రిపేర్లు లేకపోవడంతో అవి తుప్పుపట్టి మూలకు చేరాయి. భవనంలో సరైన విద్యుత్ వైరింగ్ లేకపోవడంతో చాలాసార్లు మరమ్మత్తులు జరుగుతూనే ఉన్నాయి. భవనం నిర్మించి 30 సంవత్సరాలు పైబడి అవ్వడంతో పెచ్చులు ఊడి ఒక్కొక్కసారి రోగులపై పడుతున్నాయి. ఆస్పత్రిలో మరమ్మతులు గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీ కళ్యాణిని సంప్రదించగా ప్రభుత్వం ఆధ్వర్యంలో బృందం వచ్చి పరిశీలించి ఖర్చుపై నమూనా వేశారని త్వరలోనే మరమ్మతులు జరుగుతాయని వివరించారు.



తాత్కాలికంగా మందులు కొనుగోలు

నరసాపురం : నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆహారం అందించే కాంట్రాక్టు ఒప్పందం కుదరలేదు, గత ప్రభుత్వ హయాంలో 2025 వరకు బయట వ్యక్తికి ఆహారం సప్లై చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తే సప్లై చేస్తున్నారు. ఒప్పందం పూర్తికాగానే టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు. పట్టణానికి శివారున ఉండటం వల్ల వచ్చే రోగులకు, బంధువులకు క్యాంటీన్ సమస్య తలెత్తుతోంది. దీన్ని అధిగమించేందుకు ఆస్పత్రి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం 100 పడకల కొత్త భవనం అవ్వడం వల్ల అంతా ఆధునికంగా ఉంది. ఫ్యాన్లతోపాటు రెండు ప్రసూతి వార్డుల్లో ఏసీ సదుపాయాలు కల్పించారు. మొత్తం 17 ఏసీ స్పెషల్ రూమ్‌లు ఉన్నాయి. ఇక దోమలు రాకుండా చుట్టూ ఫెన్సింగ్ చుట్టారు. జిల్లాలో అతి పెద్ద దుప్పట్లు ఉతికే డ్రైయింగ్ మిషన్ ఈ ఆస్పత్రి కలిగి ఉంది. కాంట్రాక్టు పద్ధతిపై దోబీలను నియమించుకున్నారు. శానిటరీ సిబ్బంది కొరత ఉంది. ఉన్న సిబ్బందితోనే ఈ పనులన్నీ చేయించడం వల్ల ఒత్తిడి భారం పెరిగింది. ఇటీవల కొన్ని మందులు నిండుకున్నాయి. అయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం వల్ల ఆ సొమ్ముతో అవసరమైన మందుల్ని కొనుగోలు చేశారు. మళ్లీ స్టాక్ వస్తే ఫరవాలేదు. లేకపోతే రోగులకు మందుల కొరత తప్పదు.

వచ్చే ఏడాది క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం

ఆర్.సుప్రియ, సూపరింటెండెంట్, నరసాపురం



ఆస్పత్రిలో చేరిన బంధువుల రోగులకు ఆహారం సమస్య తలెత్తకుండా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇది వచ్చే ఏడాది ప్రారంభం కావొచ్చు. దీని వల్ల రోగులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం మందుల కొరత లేదు. నెలాఖరు వరకు సరిపోతాయి. కొత్త భవనం అవ్వడం వల్ల పెద్దగా సమస్యలు లేవు. శానిటరీ సిబ్బంది కొరత ఉంది. భర్తీ చేయమని జిల్లా అధికారులకు నివేదించాం

ఫ్యాన్లు లేక ఇబ్బందులు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుమారు 75 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. చలి కాలం కావడంతో రోగులు కప్పుకోవడానికి ఎవరికి వారే దుప్పట్లు తెచ్చుకున్నామని చెప్పారు. చాలినన్ని ఫ్యాన్లు లేవని అందువల్ల దోమలతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. శుక్రవారం ఆసుపత్రిలో 13 మంది బాలింతలు ఉన్నారు. నలుగురికి ఆపరేషన్లు చేయగా ఒకరికి సాధారణ డెలివరీ అయ్యింది. సమయానికి భోజనం, మందులు అందిస్తున్నారని రోగులు చెప్పారు.



భీమవరంలో తుప్పు పట్టి మూలకు చేరిన బెడ్‌లు



తణుకులో పక్కన పడేసిన తుప్పు పట్టిన కుర్చీలు



అద్దె భవనంలో ఆకివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఏలూరు ఆసుపత్రిలో వెంట తెచ్చుకున్న దోమల బ్యాట్



పాలకొల్లు ఆసుపత్రిలో..





ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు

నేటి నుంచి శ్రీవారి తిరువీధి సేవలు

ద్వారకాతిరుమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానరాజ గోపురం మెట్లదారి మార్గంలో మహిళలు పూజాధికాలు జరిపారు. పాదుకామండపాన్ని, ధ్వజస్తంభ ప్రాంతాన్ని అరటిబోదెలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఆలయ మెట్లకు పసుపు, కుంకుమలు అద్ది బొట్లుపెట్టి హారతులిచ్చారు. రంగవల్లులతో మెట్ల దారిని అలంకరించారు. నెల రోజులపాటు ధనుర్మాస ఉత్సవాలు క్షేత్రంలో నేత్రపర్వంగా జరగనున్నాయని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ప్రతీ రోజూ శ్రీవారి తిరువీధిసేవ జరుగుతుందన్నారు. ఆలయంలో సుప్రభాత సేవలకు మారుగా తిరుప్పావై సేవలు జరుగుతాయన్నారు.







సారె తీసుకువస్తున్న మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నాంగల్యదేవి ఆలయ ప్రతినిధులు

కోట సత్తెమ్మకు చీర, సారె

నిడదవోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా రెండో రోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలు నాంగల్యదేవి దేవస్థానం అధికార్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారికి చీర,సారె సమర్పించారు. దేవస్థానం తరపున మేళ తాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జాతీయ అథ్లెటిక్స్‌కు వ్యాయామ కళాశాల విద్యార్థులు

దెందులూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయంలో మూడు రోజులుగా జరిగిన అంతర కళాశాల అథ్లెటిక్స్‌లో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు పరుగుపందెం పోటీల్లో ప్రతిభ కనబరిచి బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ తెలిపారు. ముగ్గురు క్రీడా కారులు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగ నున్న ఆల్ ఇండియా పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల ఆవరణలో క్రీడాకారులను సన్మానించారు. బీపీడీ రెండవ సంవత్సరం చదువుతున్న ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన వి.జయశ్రీ కేవలం 12 సెకన్లలో 100 మీటర్లు దాటి రికార్డు సృష్టించి పోటీలకు ఎంపికైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం బేసిరెడ్డి గ్రామానికి చెందిన సత్య దుర్గాభవాని 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో, తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామానికి చెందిన పావని సాయిమహా 21 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రతిభ చూపారు.

రోలర్ స్కేటింగ్‌లో మాంటిస్సోరి విద్యార్థులకు పతకాలు

తణుకు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేషనల్ రోలర్ స్కేటింగ్ షిప్ పోటీలలో పలువురు పతకాలు సాధించినట్లు మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు చెప్పారు. ఈనెల 5 నుంచి 15 వరకు తమిళనాడులోని కోయంబత్తురులో జాతీయ స్థాయి 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. మోయిత్రీదాస్ ఇన్‌లైన్ హాకీలో అండర్-11 విభాగంలో బంగారుపతకం, నిత్యేష్ గౌడ్ రోలర్ హాకీలో మిక్స్‌డ్ అండర్-11 విభాగంలో కాంస్య పతకం, రోలర్ హాకీ మిక్స్‌డ్



అండర్-14లో జి.జశ్వంత్, నాగసాయికేశవ్‌లు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. కోచ్ భార్గవ్, విద్యార్థులను అభినందించారు.

ఉద్యాన వర్సిటీ విద్యార్థులకు కోకోవా ఇండియా స్కాలర్‌షిప్‌లు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ విద్యార్థులకు ముంబయ్‌కి చెందిన మొండేలేజ్ కోకోవా ఇండియా లిమిటెడ్ సంస్థ స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు ఉపకులపతి డాక్టర్ గోపాల్ తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెంలోని ఉద్యాన విశ్వ విద్యాలయ పరిపాలనా భవనం వద్ద సంస్థ చైర్మన్ రూపక్ భట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యార్థులకు ప్రతీ ఏటా రూ.13 లక్షలు స్కాలర్ షిప్‌లు అందించనున్నారు. జీవితకాల



ఒప్పందం కుదుర్చుకున్న వర్సిటీ వీసీ, సంస్థ చైర్మన్

సాఫల్య అవార్డు అందుకున్న వీసీ గోపాల్‌కు వర్శిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు,డీన్ నారం నాయుడు, వర్శిటీ అధికారులు అభినందనలు తెలిపారు.



పట్టింపాలెంలో మినప పంట నూరుస్తున్న దృశ్యం



వీరంపాలెంలో ఆరబెడుతున్న రైతు

మెట్టలో మినప సిరులు

ఎకరాకు రూ.30వేల పైనే ఆదాయం

రైతుల కళ్లల్లో ఆనందం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో మినపపంట రైతుల మోములో చిరునవ్వు పూయిస్తున్నది. సార్వా సీజన్‌లో ధాన్యం పంట తరువాత మినప పంట వేసిన రైతులకు వాతావరణం అనుకూ లించడంతో ఎకరాకు పది క్వింటాళ్ల మినుములు దిగుబడి వస్తుండటంతో రైతులు ఆనందంలో తేలియాడుతున్నారు. మెట్ట ప్రాంతంలోనే ఈ సీజన్‌లో మినుములు పండించుకునే అవకాశం ఉంది. తాడేపల్లిగూడెం మండలంలోని పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, వీరం పాలెం, కొమ్ముగూడెం, నీలాద్రిపురం తదితర గ్రామాల్లో మినుము సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.20 వేలు ఖర్చవుతుండగా మిను ములు క్వింటాకు రూ.8300 అంది స్తున్నారు. దీంతో పది క్వింటాళ్లకు రూ.83 వేలు వస్తుండగా ఖర్చులు పోనూ రైతులకు మంచి ఆదాయం అందుతోంది. దీంతో మినుములు వేసిన రైతుల మోముల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

మెట్ట రైతుల్లో ఆనందం..

రాబోయేది సంక్రాంతి సీజన్ కావడంతో మినములకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో మార్కెట్‌లో మినుములు క్వింటా రూ.8,500 నుంచి రూ.9,200 వరకూ ధర పలుకుతోంది. ఈ ధరకు కమీషన్ వ్యాపారులు చేల దగ్గరే మాసూళ్లు చేసిన వెంటనే కొనుగోలు చేసుకుని వెళ్లిపోతున్నారు. రైతులు కూడా ఈ ధరకు ఆనందంగా అమ్ముకుంటున్నారు. తాడేపల్లిగూడెం మండలం మినప పంటకు అనుకూలంగా ఉండటంతో ఖరీఫ్ సీజన్ మాసూళ్ల సమయంలో మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో ఈ పంట వేశారు. వీబీఎన్ 8, టీ 9, పి 31 వంటి రకాలు వేశారు. ఈ సీజన్‌లో వాతావరణం కలిసి రావడం ధర ఆశానకంగా ఉండటంతో రైతులకు సిరులు కురుస్తున్నాయి.

గతేడాది వర్షంతో నష్టపోయాం



మినప పంట ఈ సీజన్‌లో రైతులకు బాగా కలిసొచ్చింది. ఎకరాకు రూ.30 వేల వరకూ ఆదాయం లభిస్తుంది. ఖర్చులు అన్ని పోను ఆదాయం కనిపిస్తుండటంతో ఈ సంక్రాంతికి రైతులు పండగ ఆనందంగా చేసుకుంటాం. గత ఏడాది వర్షాలకు మినప పంట మొత్తం పోయి చేలలోనే వదిలేశాం. ఈ సారి అంతా కలిసి వచ్చింది.

-వీరమల్లు శ్రీనివాస్, పట్టింపాలెం

ఈసారి కలిసి వచ్చింది..



మినప పంట ఈ సారి రైతులకు కలిసి వచ్చింది. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వస్తోంది. జిల్లాలో ఒక్క తాడేపల్లి గూడెం మండలంలోనే 2,200 ఎకరాలలో ఈ మినప పంట వేశారు. ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందంలో ఉన్నారు.

- ఆర్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి



చలి పంజా

» వణికిస్తున్న చలిగాలులు
» ఏజెన్సీలో మరింత అధికం

ఏలూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై చలి పంజా విసురుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ శీతాకాలంలో అతితక్కువగా ఉష్ణో గ్రతలు నమోదు కావడం విశేషం. నాలుగు రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఇటీవల వరుస అల్పపీడనాల కారణంగా ఉత్త రాంధ్రలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దానికి తగ్గట్టుగానే చలి తీవ్రత నాలుగు రోజులుగా పెరుగుతూ వస్తోంది. సోమవారం నాటికి ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి. గతంలో ఈ రోజుల్లో ఇంత తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాలేదని చెబుతున్నారు. ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత తటుకోలేక ప్రజలు రాత్రి సమయాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు. రాత్రి పూట ప్రయాణాలు చేసే వారు చలికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చలిగాలుల తీవ్రత వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సంబంధ వ్యాధులు ఎక్కువగా సంక్రమిస్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో 20 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆది, సోమవారాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివారం కంటే సోమవారం ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తగ్గింది. ఆదివారం 31/15 డిగ్రీలు నమోదు కాగా, సోమవారం 30/14 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమో దైనట్టు ఇంటర్‌నెట్ సమాచారం. జిల్లాలో చలి తీవ్రత పెరగడంతో మూడు రోజులుగా ఉన్ని దుస్తుల కు గిరాకీ పెరిగినట్టు దుకాణదారులు చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రదేశం	ఉష్ణోగ్రత (పగటి/రాత్రి) సెంటీగ్రేడ్‌లో
కొయ్యలగూడెం	28/13
చింతలపూడి	29/14
జంగారెడ్డిగూడెం	30/14
బుట్టాయిగూడెం	30/14
పోలవరం	30/14
భీమడోలు	30/14
దెందులూరు	30/14
నూజివీడు	29/14
ఏలూరు	30/14
భీమవరం	29/14
నరసాపురం	30/14
కుక్కునూరు	31/15
తాడేపల్లిగూడెం	31/15
నిడదవోలు	31/15
కొవ్వూరు	31/15
కైకలూరు	31/17
ఆకివీడు	31/17
తణుకు	30/17
పాలకొల్లు	29/20

‘ఉద్యోగ సంఘ నేతలపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు’

ఏలూరు క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థికపరమైన అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని చేపట్టిన ఉద్యోగ సంఘ నేతలపై వైకాపా ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగ సంఘ జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ అన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘ నేతలపై స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించిన వాయిదాలకు సోమవారం ఉద్యోగ సంఘ నాయకులు శ్రీనివాస్, హరినాథ్, పూల ఆంజనేయులు, ముస్తాపా అలీ, కృష్ణ, ఆదినారాయణ తదితరులు హాజరయ్యారు. చోడగిరి మాట్లాడుతూ మాపై నాన్ బెయిల్‌బుల్ కేసులు బనాయించారని, తప్పుడు కేసులు పెట్టి ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారని ఆవేదన చెందారు. మళ్లీ ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు.

తాడువాయి సుగర్ కర్మాగారం తాత్కాలికంగా నిలుపుదల

తణుకు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ తాడువాయి కర్మాగారానికి సరిపడినంత చెరకు లేనందున తాత్కాలింగా నిలిపివేసేందుకు నిర్ణయించినట్టు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గానుగ ఆడు సీజనుకు చెరకు లేనందున తాత్కాలింగా నిలిపివేయనున్నామని, రైతులు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



గాంధీభవనంలో మూర్తిరాజు జయంతి వేడుకల్లో పాల్గొన్న ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మూర్తిరాజు

ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు

నిడమర్రు డిసెంబరు 16 : ఉమ్మడి పశ్చిమ గోదావరిలో విద్యాదాతగా, గాంధేయవాదిగా సర్వోదయ సిద్ధాంతాలను ఆచరించి చూపించిన మూర్తిరాజు ఎప్పుడు ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పేర్కొన్నారు. పెదనింద్రకొలను గాంధీ భవన్‌లో సోమవారం చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు 106వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎల్.ఎన్. రాజు రాసిన మూర్తిరాజు జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. మంతెన రామరాజు మాట్లాడుతూ గాంధీభవన్‌ను మూర్తిరాజు ఆశయాలకు అనుగుణంగా నాలెడ్జ్ సెంటర్‌గా, మ్యూజియంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరపున కృషి చేస్తానన్నారు. అనంతరం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు అలరించాయి. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జిల్లా సర్వోదయమండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వర రాజు, చింతలపాటి బాసిరాజు, వంగా రఘు, భీమరాజు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. మూర్తిరాజు స్వగ్రామమైన ఫత్తేపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతి వనంలో మహాత్మా గాంధీ, చింతలపాటి మూర్తిరాజు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం సాగిరాజు జానకిరామరాజు అధ్యక్షతన నిర్వహించారు. గాంధీ విగ్రహన్ని జిల్లా మాజీ విద్యాశాఖాధికారి ఇందుకూరి ప్రసాదరాజు , మూర్తిరాజు విగ్రహన్ని పత్సమట్ల ధర్మరాజు ఆవిష్కరించారు. ఫత్తేపురం గ్రామస్థులు పెన్మత్స సత్తిరాజు ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. లయన్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి, సర్పంచ్ నీలపాల సాయిప్రియ, ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.



లేహ్యం పరిశ్రమను పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్‌వర్మ

లేహ్యం పరిశ్రమను పరిశీలించిన అధికారుల బృందం

తణుకు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):తేతలి పరిధిలోని సత్యవాడ రోడ్డులోని ఉన్న లేహ్యం ఫుడ్ పరిశ్రమను రెవెన్యూ, పంచాయతీ అధికారుల బృందం సోమవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ డీవీవీఎస్ అశోక్‌వర్మ, ఈవోపీఆర్డీ రామప్రసాదు, మండల సర్వేయర్, తేతలి గ్రామ కార్యదర్శులు ఉమ్మడిగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ పరిశ్రమను చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని, దానివల్ల ఆరోగ్య సమస్యలకు, అసౌకర్యానికి గురవుతున్నట్టు గ్రామస్థులు ఫిర్యాదులు చేశారన్నారు. తనిఖీల్లో పశువుల శాల, పశువుల చర్మాలను నిల్వ చేసే ప్రదేశం, రక్తం శుద్ధి చేసే యూనిట్, పౌడర్‌గా మార్చు విధానం, నీటి శుద్ధి ప్లాంటులను తనిఖీ చేసినట్టు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

ఎర్ర కాల్వ.. కడగండ్లు..!

» నేటికీ వీడని వరదల విలయం
» గండ్లు పడినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
» ఏ రైతును కదిపినా కన్నీళ్లే
» కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ఎర్రకాల్వ రైతులకు కడగండ్లు మిగులుస్తోంది. ఏటా వచ్చే వరదలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం ఇటు వైపు చూడకపోవడంతో రైతులు పంటలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాడే పల్లిగూడెం మండలం మాధవరానికి చెందిన అడబాల త్రిమూర్తులుకు ఎర్రకాల్వ సమీపంలో కోతిగుంట చెరువు పక్కన ఎకరం పొలం ఉంది. గత జూలైలో వచ్చిన వరదలకు పొలంలోని పంటతోపాటు మట్టిని కూడా గండి లాక్కుపోవడంతో 20 సెంట్ల మేర పొలం చిన్నపాటి చెరువులా మారింది. కనీసం తర్వాత పంట వేసుకుందామన్నా ఇసుక మేటలు వేయడంతో కుదరలేదు. రబీ సీజన్‌లోనైనా సాగుకు అనుకూలంగా చేలో పడిన గొయ్యి పూడుద్దామనుకుంటే ఆర్థిక స్థోమత్త సరిపోవడం లేదు. దీంతో రూ.30 వేలు అప్పుచేసి ఉన్న గొయ్యిని పక్కన పెట్టి చిన్నపాటి గట్టు వేసి పొలం సిద్ధం చేసుకుంటున్నాడు. ఇది ఈ వరదలకే కాదు ఎప్పుడు వరదలు వచ్చినా గండ్ల దెబ్బకు ఇదే పరిస్థితి. ఏటా కొంత అప్పు చేసి బాగు చేసుకోవాల్సిందే. ఈ బాధలు పడలేక అయిన కాడికి ఉన్న చేలు అమ్ముకున్న వారు చాలా మంది ఉన్నారు. పరిస్థితి మారాలంటే ప్రభుత్వం చొరవ చూపి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు వేడుకుంటున్నారు.



చెరువులా మారిన త్యాజంపూడి వెళ్లే పుంత మార్గం



ఎర్రకాల్వ వరద ఉధృతికి పొలం మధ్యలో కోత..బాధిత రైతు త్రిమూర్తులు

ఆరు నెలలు దాటినా..

ఎర్రకాల్వకు వరదలు వచ్చి ఆరు నెలలు దాటినా నేటికీ ఆ వరదలు మిగిల్చిన విలయం రైతులను వెంటాడుతూనే ఉంది. వర్షాలకు ఎర్ర కాల్వ ఉధృతికి పడిన గండ్లు వందలాది ఎకరాల్లో మేటలు వేశాయి. వాటితోపాటు పెద్ద పెద్ద ఇసుక, మట్టి మేటలు వేసి తీయలేనంత భారంగా మారాయి. త్యాజంపూడి వెళ్లే పుంత కొట్టుకుపోయి పెద్ద కొలనులా మారింది. గత వైసీపీ హయాంలో గండ్లు పడినా పట్టించుకోలేదు. కనీసం ఇసుక బస్తాలు వేయకపోడంతో గట్టు పెద్ద పెద్ద గండ్లు పడి ఆ ప్రాంతంలో గట్టు ఉన్నట్టు ఆనవాలే లేకుండాపోయింది.

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఎర్రకాల్వ వరద సమస్యకు కూటమి ప్రభుత్వమే పరిష్కారం చూపాలి. గతంలోను ఎర్రకాల్వ గట్లు పటిష్టం చేసేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. కానీ గట్టు లైను లేకపోవడంతో వరదలకు కొట్టుకుపోయాయి. కూటమి నాయకులు దీనిపై దృష్టి సారిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

అడ్డగర్ల ప్రసాద్, ఎర్రకాల్వ- 1, నీటి సంఘ అధ్యక్షుడు

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము జమ

మంత్రి నాదెండ్ల మనోహర్

పోలవరం డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టిసీమలో ధాన్యం కల్లాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో మాట్లాడారు. పోలవరం మండలంలో ప్రతి రైతు సేవా కేంద్రం నుంచి ప్రతి ఒక్క రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మేలా చర్యలు తీసుకున్నామన్నారు. నాణ్యమైన గోనె సంచులు, రవాణా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జేసీ ధాత్రి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జేసీ ధాత్రి రెడ్డి

తడికలపూడిలో హర్షిత స్కూలు వద్ద హైడ్రామా

» ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకునేందుకు రాజమహేంద్రవరం నుంచి సీఐడీ బృందం రాక
» సెక్యూరిటీ సిబ్బందితో స్వల్ప ఘర్షణ
» గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్న ప్రిన్సిపాల్

కామవరపుకోట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):తడికలపూడి హర్షిత ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ నందిగం రాణిని అదుపులోకి తీసుకునేందుకు రాజమహేంద్రవరం నుంచి సీఐడీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పది మంది బృందం సోమవారం పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బందికి, సీఐడీ బృందానికి కొద్దిపాటి ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం... హర్షిత స్కూలు ప్రిన్సిపాల్ నందిగం రాణిపై హైదరాబాదు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో 65 మంది తమను ప్రిన్సిపాల్ ఆన్‌లైన్ ద్వారా మోసం చేసి, రూ.33 కోట్లు నిధులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెను గత ఏడాది సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేయగా ఆమె కొంతకాలం జైలులో ఉండి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం సీఐడీ బృందం రావడంతో ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకోవడానికి వచ్చారని విద్యార్థులు గ్రహించి, వారి ఎదుట నినాదాలు చేశారు. ఈ సందర్భంలోనే ప్రిన్సిపాల్ రాణి పాఠశాల పైఅంతస్తులో ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐడీ బృందం ఆమె వున్న గదికి వెళ్లి తలుపు తీయాలని నోటీసు ఇవ్వడానికి వచ్చామని చెప్పినప్పటికీ రాత్రి వరకు తలుపులు తీయలేదు. సీఐడీ బృందం అక్కడే కాపు కాసింది. గదిలో ఉన్న ప్రిన్సిపాల్ రాణి న్యాయవాదులతోను, ఆమె తరపు బంధువులతోను ఫోన్‌ల ద్వారా సంప్రదించారు. ఈ ఘటనతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందారు. ఆమెను అరెస్టు చేసి తీసుకువెళ్తే తమ పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సీఐడీ బృందం ఎదుట వాపోయారు. రాత్రి పొద్దు పోయిన తర్వాత గదిలో ఉన్న ప్రిన్సిపాల్‌కు సీఐడీ పోలీసులు కిటికీ ద్వారా నోటీసు ఇచ్చి తమ కార్యాలయానికి రావాలని చెప్పి వెనుదిరిగారు.



పాఠశాలలో ప్రిన్సిపాల్ కోసం వేచి చూస్తున్న సీఐడీ బృందం



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

నూజివీడు టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలను చెల్లించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐసీటీయు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ పాఠశాలలో పారిశుధ్య కార్మికులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీతాలు చెల్లించలేదని, ఎమ్‌డీఎమ్ కార్మికు లకు గత ప్రభుత్వం రూ.3 వేలు ఇవ్వగా కూటమి ప్రభుత్వం రూ.2 వేలు చెల్లించడం దారుణమన్నారు. కనీస వేతన రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్, వేముల బక్కయ్య పరికల కళావతి, ఆనందరావు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ మెటలర్జీ విభాగానికి చెందిన విద్యార్థులు కేసీపీ ఇంజనీర్స్ ప్రై.లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మెటలర్జీ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపిక కాగా వారిని ఆయన అభినందించారు. గత కొనేళ్లగా మెటలర్జీ విభాగం ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. హెచ్.వో.డి బి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వీర శ్రీను, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని ఏపీఎస్పీ కానిస్టేబుల్ మృతి



మధుబాబు (ఫైల్)

ఏలూరు క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ను రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఏలూరు గొల్లగూడానికి చెందిన రామేశ్వరపు మధుబాబు (41) కాకినాడలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చాడు. తిరిగి ఆదివారం రాత్రి కాకినాడ వెళ్లే నిమిత్తం బస్టాండ్ వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరి కాలిమార్గాన నరసింహారావుపేట వైపు వెళ్లడానికి రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో కాకినాడ నుంచి తిరుపతి వెళుతున్న రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. సోమవారం ఉదయం సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఇంటి ముందు ఉంచిన ఆటో.. తెల్లవారేసరికి మాయం

నరసాపురం టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13 వార్డులో ఆటో చోరీకి గురైంది. దర్గా సెంటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ బాజీ తన ఇంటి ముందు ఆదివారం రాత్రి ఆటోను పార్క్ చేశాడు. సోమవారం ఉదయం చూసే సరికి ఆటో లేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

ఫోన్ మాట్లాడుతూ.. లారీకి ఉరేసుకున్న డ్రైవర్

ఏలూరు క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫోన్ మాట్లాడుతూనే తాను డ్రైవర్‌గా పని చేస్తున్న లారీకే ఉరి వేసుకుని డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పశ్చిమ బెంగాల్లోని కుర్చీ బీహార్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రాజఉల్హక్(24) నాలుగు నెలల క్రితం ఏలూరుకు చెందిన కామినేని శ్రీనివాస్ అనే లారీ యజమాని వద్ద డ్రైవర్‌గా చేరాడు. ఏలూరు బైపాస్ రోడ్డు పోస్టల్ కాలనీ వద్ద లారీ ఆఫీస్‌లోనే ఉంటూ పశ్చిమ బెంగాల్‌కు నిమ్మకాయల లోడ్లను వేసుకుని వెళ్ళి వస్తుండేవాడు. అతనికి వివాహం కాలేదు. ఆదివారం రాత్రి ఆఫీసులో అందరి డ్రైవర్లతో పాటు నిద్రించాడు. అయితే రాత్రి 11 గంటల ప్రాంతంలో లేచి ఆ పక్కనే ఉన్న రోడ్డుపై పార్క్ చేసిన లారీ టాప్ ఎక్కి చాలా సమయం ఫోన్ మాట్లాడాడని అక్కడున్న వాచ్‌మెన్ చెబుతున్నాడు. తెల్లవారేటప్పటికి ఆ లారీ టాప్‌కి పొడవాటి టవల్‌తో ఉరి వేసుకుని కన్పించాడు. అతని చెవిలో ఇయర్ ఫోన్స్ అలానే ఉన్నాయి. ఈ సమాచారం అందుకున్న ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.అజయ్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు.

నిద్ర మత్తులో డ్రైవర్.. ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

ద్వారకాతిరుమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి ద్వారకా తిరుమలకు వస్తున్న ఓ కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో కారుముందు భాగం ధ్వంసం కాగా ఇల్లు దెబ్బ తింది. అయితే ఏవిధమైన ప్రాణ నష్టం జరక్కపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గుంటూరుకు చెందిన ఓ కారులో కొందరు స్వామి దర్శనార్థం సోమవారం ఉదయం ద్వారకాతిరుమలకు వస్తోంది. స్థానిక నిమ్మకాయల మార్కెట్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లాడు. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. అయితే ఆ ఇంట్లో ఉన్న మహిళ భయంతో బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే కారులో ఉన్న నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.





కారు దూసుకెళ్లడంతో ధ్వంసమైన ఇల్లు.. ధ్వంసమైన కారు

సారా కేసు నమోదు

చింతలపూడి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గొల్లగూడెం, పాశ్వానగరం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి పి.వెంకాయమ్మ నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పాశ్వానగరంకు చెందిన పి.శ్రీనివాస రావును పాత సారా కేసులో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

మోటార్ సైక్లిస్టు మృతి

చింతలపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం తలార్లపల్లిలో సోమవారం రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న చాట్రాయి మండలం బర్రిబందానికి చెందిన తనగాల కాంతారావు(55) అనే వ్యక్తి విద్యుత్ స్తంభానికి ఢీ కొని మృతి చెందాడు. పాతిమాపురంలో ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతనికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.


పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే





పోలవరం ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వాగతం పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్


పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి సీఎం కాన్వాయ్

సీఎం చంద్రబాబు పర్యటన

పోలవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్ట్ పరిశీలనకు సోమవారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం నియోజకవర్గ సమస్యలపై ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేశారు. వేలేరుపాడు మండలంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటు చేయాలని కోరారు. పెదవాగు ప్రాజెక్టును ఏపీ తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టుగా ప్రతిపాదించాలని కోరారు. పోలవరం మండలం టేకూరు ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు, పునరావాసాల నిర్మాణం, బస్సు, వైద్య సౌకర్యాలు కల్పించాలని, దేవరగొంది ప్యాకేజీ 2 లో విడుదల చేయాల్సిన మిగిలిన పరిహారాలు, ఇళ్ళ స్థలాల పంపిణీ, భూమి లేని పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరినట్లు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించండి

జీతాల బకాయి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం అందజేశారు. 8 నెలలుగా జీతాలు లేక అప్పులతో బతుకుతున్నామన్నారు.

వైద్య శిబిరాలు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయ ఆవరణ, ప్రాజెక్టు మోడల్ హౌస్ ఆవరణలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇద్దరు వైద్యాధికారులు, 25 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారని సుమారు 70 మందికి వైద్య సేవలందించి మందులు పంపిణీ చేసినట్లు వింజరం వైద్యాధికారి మురళీధర్ తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జడ్పీ చైర్‌పర్సన్ గంటా శ్రీలక్ష్మి, ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలాజీ, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకట్రాజు, పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ముఖ్యమంత్రి వెంట జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

రేపు జిల్లాలో విద్యుత్ బిల్లుల దహనం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 18న జిల్లావ్యాప్తంగా విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమాన్ని నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. సీపీఎం కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా సమస్యలపై ఆందోళనలు, పోరాటాలు చేపట్టాలని జిల్లా మహాసభల్లో పిలుపునిచ్చామన్నారు. 26వ మహాసభల్లో భాగంగా నూతన కమిటీని ఎంపిక చేశామన్నారు. జిల్లా కార్యదర్శిగా తాను, కార్య దర్శివర్గ సభ్యులుగా డీఎన్‌వీడీ.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ ఎన్నికయ్యారన్నారు. మరో 16 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపికైనట్టు తెలియజేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ట్రూఅప్ సర్దుబాబు ఎలక్ట్రికల్ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీలు ఒడ్డిస్తున్నారని విమర్శించారు. ఆయన వెంట సీపీఎం నాయకులు డీఎన్‌వీడీ.ప్రసాద్, పి.రామకృష్ణ, లింగరాజు, కె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్ మీట్‌లో సెయింట్ థెరిసాకు పతకాల పంట


విజేతలతో ప్రిన్సిపాల్, పీఈటీలు, తదితరులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నన్నయ యూనివర్సిటీ ఆవరణలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ మీట్-2024లో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు పతకాల పంట పండించారు. 6 విభాగాల్లో స్వర్ణ, 9 విభాగాల్లో రజిత పతకాలు, 4 విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. వివరాలను డాక్టర్ సుశీల సోమవారం తెలిపారు. 400 మీటర్ల హర్డిల్స్‌లో పి.నాగవినయశ్రీ, 400మీటర్ల పరుగులో బి.నీలిమ, 400 మీటర్ల రిలేలో ఎ.తల్లీఅరుణ, టి.జ్యోతి, బి.నీలిమ, సీహెచ్.వెంకటేశ్వరమ్మకు బంగారు పతకాలు లభించాయి. హై జంప్, 100 మీటర్ల హర్డిల్స్‌లో ఎ.తల్లీ అరుణ, 400 మీటర్ల పరుగులో పి.నాగ వినయశ్రీ, 5 కిలోమీటర్ల నడకలో సీహెచ్.ఝాన్సీదుర్గ, 800 మీటర్ల పరుగులో సీహెచ్. వెంకటేశ్వరమ్మ, 200 మీటర్ల పరుగులో జి.త్రివేణి, 400మీటర్ల హర్డిల్స్‌లో జి.పుణ్య, 1500మీటర్ల పరుగులో ఎ.పూర్ణచంద్రిక, 100మీటర్ల రిలేలో పీఎల్.ప్రవల్లిక, జి.త్రివేణి, ఏ.పూర్ణచంద్రిక, ఎం.నవ్యశ్రీలకు రజిత పతకాలు లభించాయి. 100మీటర్ల హర్డిల్స్‌లో టి.జ్యోతి, బ్రాడ్‌జంప్, జావలెన్ త్రోలో పి.కావ్యశ్రీ, హెపటథ్లాన్‌లో ఎస్.జెస్సీ తన్మయి కాంస్య పతకాలు సాధించారు. విజేతలను వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పీఎం.సెలీన్‌రోజ్, శ్యామల తదితరులు అభినందించారు.

విద్యార్థులకు 'అమరజీవి' బహుమతులు


విద్యార్థినికి జ్ఞాపికను బహూకరిస్తున్న డీఈవో

ఏలూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో సోమవారం జరిగాయి. అన్ని మండలాల నుంచి 118 మంది విద్యార్థులు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. వ్యాసరచన పోటీలో జీలుగుమిల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థి కె.సాయి పవన్ కుమార్, నూజివీడు త్రివిధ హైస్కూలు విద్యార్థిని సీహెచ్. సాహితి, జంగారెడ్డిగూడెం జడ్పీ హైస్కూలు విద్యార్థిని వి.సాయి ప్రసన్న ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీలో నూజివీడు త్రివిధ స్కూలు విద్యార్థిని సీహెచ్.భానుజోషిక, కామవరపుకోట జడ్పీ హైస్కూలు విద్యార్థిని వై.కృపాసాయి, ఆగిరిపల్లి మండలం శోభనాపురం పాఠశాల విద్యార్థిని ఎస్.హేమశ్రీ విజేతలుగా నిలిచారు. క్విజ్ పోటీలో జంగారెడ్డిగూడెం జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.శ్రీప్రియ, కామవరపుకోట జడ్పీ హైస్కూలు విద్యార్థి బి.ముక్కోటి, నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థిని ఎస్.గీతిక తొలి మూడుస్థానాల్లో నిలిచారు. వీరందరికీ జ్ఞాపికలను డీఈవో బహూకరించారు. ఆమె మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాలకోసం తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి త్యాగాన్ని విద్యార్థులు మరువరాదన్నారు. డీవైఈవో రవి ప్రకాష్, సమగ్రశిక్ష విలీన విద్య జిల్లా కోఆర్డినేటర్ భాస్కరరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత మూర్తిరాజుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు సేవలు మరువలేనివని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. మూర్తిరాజు జయంతి సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యను దగ్గర చేసిన ఘనత విద్యాదాత మూర్తి రాజుకే చెందుతుందన్నారు. నేటి విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బొడపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యాదాత మూర్తిరాజు జయంతి కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మూర్తి రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

28న అక్కినేని శత జయంతి స్వరాంజలి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చలనచిత్ర నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న స్వరాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. సీఆర్.రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందని ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్.సుభాని తెలిపారు. స్వరాంజలి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. నిర్వహణ కమిటీ కార్యదర్శి నేతర అజయ్‌బాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు, దేవ రత్నాకర్, విజయశ్రీనివాసరావు, చైల్డ్‌రైట్స్ కమిషన్ మెంబర్ రాజేంద్రకుమార్, పాల్గొన్నారు.


ఏలూరు మండలంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో అచ్యుత అంబరీష్, పెదవేగి, బుట్టాయగూడెం మండలాల్లో వినతుల స్వీకరణ

రెవెన్యూ సదస్సులతో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం

ఏలూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో అచ్యుత అంబరీష్ తెలిపారు. మాదేపల్లిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సమస్యలను దరఖాస్తు ద్వారా తెలియపరచాలన్నారు. 45రోజుల్లోగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. పలువురు రైతులు, వివిధ సమస్యలపై 40కి పైగా దరఖాస్తులు అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆయాశాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పెదవేగి: భూసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఆర్ఐ కేబీవీ.సారథి అన్నారు. తాళ్ళగోకవరంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వినతులు అందించారు. రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభల నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నెక్కలపూడి రామచంద్రరావు, సర్పంచ్ నెక్కలపూడి సురేష్‌బాబు, ఎంపీటీసీ రాజారత్నం, సర్వేయర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: కొండరెడ్డి గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, అడంగల్‌లో పేర్లు నమోదు చేయాలని రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేకాధికారి టి.లతకు వినతిపత్రాలు అందజేశారు. సర్పంచ్ మడి రాముడు అధ్యక్షతన సదస్సు జరగ్గా భూసమస్యలను కొండరెడ్లు అధికారుల దృష్టికి తెచ్చారు. తాతలు దండ్రుల కాలం నుంచి భూములను సాగుచేస్తున్నా తమ పేరున పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. పోరంబోకు భూములను సాగుచేస్తున్న కొండరెడ్లకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇతర భూ సమస్యలను కూడా పరిష్కరించాలని కొండరెడ్డి గిరిజనులు కోరారని, చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి మడకం వెంకటలక్ష్మి, డిటి పి.రమేష్, అధికారులు, రెవిన్యూ సిబ్బంది ఆదివాసీలు పాల్గొన్నారు.

● చింతలపూడి: మండలంలోని లింగగూడెం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ వారసత్వ పట్టాదారు పాస్‌పుస్తకం కావాలనుకునేవారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులలో భూసంబంధించిన సమస్యలు, రికార్డులలో తప్పులున్నా సత్వర పరిష్కారం చేస్తామన్నారు. సర్పంచ్ పి.ప్రభావతి, ఉప సర్పంచ్ గుత్తా నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మంకినపల్లి రైతులతో కొండగూడెం సచివాలయం వద్ద తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఆర్ఐ రామకృష్ణ రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామంటూ తహసీల్దార్, ఆర్ఐలు స్పష్టం చేశారు.

నేడు సైకిల్ రైడింగ్

ఏలూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా ఏలూరు సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు అథ్లెట్లు, జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ అథ్లెట్‌లతో ఫిట్ ఇండియా సైక్లోథాన్ (సైకిల్ రైడింగ్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వి.వినాయక్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఏలూరు ఇండోర్‌స్టేడియం నుండి పాత బస్టాండు, వసంతమహల్ సెంటర్‌మీదుగా ఫైర్‌స్టేషన్, ఫ్లైవోవర్, పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి సాయిశిక్షణా కేంద్రం వరకు సైకిల్‌రైడింగ్ జరుగుతుందన్నారు. వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య ప్రారంభిస్తారని తెలిపారు. క్రీడాకారులు పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

ఏలూరు టూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో లేడిస్ క్లబ్‌లో మహిళా రక్షణ చట్టాలపై సోమవారం శిక్షణ శిబిరం నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ సింగవరపు జ్యోతి తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సీహెచ్.నిర్మల మాట్లాడుతూ కుటుంబం నుంచి పనిచేసే ప్రదేశాల్లో మహిళలు శారీరక మానసిక లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలు ఉన్నప్పటికి అమలు కావడంలేదన్నారు. డీసీఆర్‌బీ కోఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ మహిళలంతా రక్షణ చట్టాల పై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాల నిషేధ చట్టం 2006 లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం 2012 గురించి వివరించారు. కార్యక్రమంలో అడ్వకేట్ బి.కృష్ణవేణి, రమాదేవి, ఎన్.లక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి : చింతమనేని


టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో సోమవారం తనను కలిసి నీటి సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. పథకాలు అర్హులకు సక్రమంగా చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ విషయంలో నీటిసంఘాల సభ్యులు చొరవచూపి, రైతుల అభివృద్ధికి కృషి, సహకారాన్ని అందించాలని ఆయన తెలిపారు. బడుగు, బలహీన రైతుల కోసం మరింత శ్రద్ధవహించాలని సూచించారు. బొప్పన సుధాకర్, కమ్మ శివరామకృష్ణ, తలకొండ జమలయ్య, బొప్పన మార్కండేయులు, కొత్తా సాంబశివరావు, కూరపాటి ధర్మారావు, వెలమాటి శ్రీనివాసరావు, పులిచర్ల వెంకటేశ్వరరావు, కోట జోజి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెదపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలో జరిగిన 9వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ వాలీబాల్ ఛాంపియన్ షిప్-2024 ఆటల పోటీల్లో వట్లూరు బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తొమ్మిది మంది పాల్గొనగా కె.నిహారిక, ఎం.అనూష జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. ఈనెల 22న జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు డి.లాలిత్య ఎంపికైందన్నారు. క్రీడాకారులను కళాశాలలో సోమవారం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు టి.సునీలకుమారి, భవాని పాల్గొన్నారు.

'పది' పరీక్షార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్

ఏలూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం యూటీఎఫ్ జిల్లా శాఖ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం డీఈవో వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, సంఘ నాయకులు రంగమోహన్, శివశంకర్, షేక్‌పర్వీన్ బేగం, చిట్టిబాబు, జిక్రియా తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం


ప్రత్యేక అలకంరణలో కైకరం వేణుగోపాలస్వామి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆలయాల వద్ద సోమవారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి, అగ్రహారం జనార్ధనస్వామి ఆలయం, పవరుపేట వాసు దేవాలయం, అశోక్‌నగర్, పడమరవీధి శ్రీవారి ఆలయాల వద్ద ధనుర్మాస పూజలు చేశారు.

● ఏలూరు రూరల్: గోదాదేవికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాస పూజలు సోమవారం మండలంలో ప్రారంభం అయ్యాయి. ద్వారకా తిరుమల దత్తక్షేత్రమైన శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ధనుర్మాసం ప్రారంభం సంక్రాంతి సందడిని తీసుకువచ్చింది.

● ఉంగుటూరు: వైష్ణవాలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభించారు. తొలిరోజు చక్కెర పొంగలి ప్రసాద వితరణ చేశారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం వేంకటేశ్వరాలయాల్లో విశేష పూజలు జరపగా సోమవారం తెల్లవారుజామున భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

శివాలయాల్లో ఆరుద్ర నక్షత్ర పూజలను చేశారు. భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు.

శివాలయంలో అభిషేకాలు

చింతలపూడి: వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర ఆర్ద్ర నక్షత్ర అభిషేకాలు చేశారు. శివలింగానికి అభిషేకాలు చేపట్టడంతోపాటు సాయంత్రం బిల్వార్చన చేశారు. మార్గశిర ఆర్ద్ర నక్షత్రం రోజున పరమేశ్వరుడికి అత్యంత శక్తివంతమైన అభిషేకం అని, ఏడాదిలో ఈ రోజున అభిషేకం చేస్తే ఎంతో మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. సాయంత్రం వేళ ఆలయం వద్ద భక్తుల బిల్వార్చనల పూజలతో కిటకిటలాడింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఊరేగింపు

ద్వారకాతిరుమల: సుబ్రహ్మణ్యేశ్వరుడి ఊరేగింపు వైభవంగా జరిగింది. పుట్ట వద్ద స్వామి వారిని పూలరథంపై ఉంచి మేళతాళాలు, డప్పు సన్నాయి వాయిద్యాలు, యువకుల ఆనందోత్సాహాలు, చిత్రవిచిత్ర వేషధారణల నడుమ ఊరేగింపు ఘనంగా జరిగింది. స్వామివారికి భక్తులు హారతులు పట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

లింగపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పంటలతో అధిక ఆదాయం లభిస్తుందని ఉద్యానశాఖ అధికారి షాఫియా పర్వీన్ అన్నారు. వేములపల్లిలో బంతి తోటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. పూలతోటలు, పండ్లతోటల రైతులకు సబ్సిడీ అందిస్తున్నామని బంతి, మిర్చి తోటలకు మల్చింగ్ పేపర్‌కు రూ.16 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు.

కషాయాల తయారీ

ఉంగుటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాచుగుంట ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సోమవారం వివిధ రకాల చీడ పీడల నివారణకు కషాయాల తయారీపై శిక్షణ ఇచ్చారు. రబీ సీజన్‌లో పంటలకు చీడ పీడల నివారణకు ఈ కషాయాలు తయారీ కోసం శిక్షణ ఇచ్చారు. నాచుగుంట అటెండెంటు డీఎంఎంటీ.విజయ రాధిక, రాజేష్, బండి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లిపూడికి జీవన సాఫల్య పురస్కారం

ఉంగుటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువైద్య లైవ్ స్టాక్ అధికారి మల్లిపూడి బాబూరావుకు హైదరాబాద్‌కు చెందిన బెస్ట్ ఆర్ట్ అకాడమీ జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. మూగ జీవులకు చేసిన సేవలకు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అకాడమి అధినేత ఈ.సూర్యనారాయణ, జి.చంద్రయ్య, మల్లాడి వెంకట కృష్ణారావు నుంచి ఆయన పురస్కారం అందుకున్నారు.

తాటాకిల్లు దగ్ధం

పెదవేగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మట్టా ధర్మయ్యకు చెందిన తాటాకిల్లు సోమవారం ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుంది. ప్రమాదంలో బాధిత కుటుంబం కట్టుబట్టలతో బయటపడింది. ఏలూరు అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అప్పటికే సామగ్రితో సహా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.రెండు లక్షల మేర ఆస్తినష్టం జరినట్లు అగ్నిమాపకశాఖాధికారులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

టి.నరసాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, విస్సంపల్లి సిద్దు పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెంలో ముదగళ్ళ ముత్తయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామ, మండల కమిటీ నిర్మాణం వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సామాజిక న్యాయం ముసుగులో కొంతమంది ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు పెట్టి అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని తుంగలో తొక్కుతున్నారని వారు తెలిపారు. పుట్టి ఈశ్వరదొర, తడికమళ్ళ ఆనందరావు, బుల్ల గంగాధర్, నల్లంటి వెంకటేష్, సందిపాం ధర్మయ్య, విస్సంపల్లి దిలీప్, ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి రెండు ప్యాకింగ్ కంటైనర్ వాహనాలను పట్టుకున్నారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి వాహనాల్లోని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరు టూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బడేటి శ్రీహరిరావు మెమోరియల్ ట్రస్ట్ పేరిట ఈ నెల 18న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ మారం హనుమంతరావు తెలిపారు. తూర్పువీధి గజ్జెలవారి చెరువు వద్ద శిబిరం నిర్వహిస్తామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాన సూచించారు.



చలి పంజా

» వణికిస్తున్న చలిగాలులు

» ఏజెన్సీలో మరింత అధికం

ఏలూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై చలి పంజా విసురుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ శీతాకాలంలో అతితక్కువగా ఉష్ణో గ్రతలు నమో దు కావడం విశేషం. నాలుగు రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఇటీవల వరుస అల్పపీడనాల కారణంగా ఉత్త రాంధ్రలో చలి తీవ్రత ఎక్కు వగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దానికి తగ్గట్టు గానే చలి తీవ్రత నాలుగు రోజు లుగా పెరుగుతూ వస్తోంది. సోమ వారం నాటికి ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల సెంటీ గ్రేడ్‌కు పడిపోయాయి. గతంలో ఈ రోజుల్లో ఇంత తక్కువగా ఉష్ణోగ్రత లు నమోదు కాలేదని చెబుతున్నా రు. ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత తటు కోలేక ప్రజలు రాత్రి సమయాల్లో చలి మంట లు వేసుకుంటున్నారు. రాత్రి పూట ప్రయా ణాలు చేసే వారు చలికి ఇబ్బందులు ఎదు ర్కొవాల్సి వస్తోంది. చలిగాలుల తీవ్రత వల్ల ప్రజలు అనా రోగ్యాల పాలవు తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సంబంధ వ్యాధులు ఎక్కువగా సంక్రమి స్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో 20 డిగ్రీల సెంటీగ్రే డ్ వరకు రాత్రి ఉష్ణోగ్రతలు నమో దయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆది, సోమవారాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివారం కంటే సోమవారం ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తగ్గింది. ఆదివారం 31/15 డిగ్రీలు నమోదు కాగా, సోమవారం 30/14 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమో దైనట్టు ఇంటర్‌నెట్ సమాచారం. జిల్లాలో చలి తీవ్రత పెరగడంతో మూడు రోజులుగా ఉన్ని దుస్తుల కు గిరాకీ పెరిగినట్టు దుకాణదారులు చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రదేశం	ఉష్ణోగ్రత (పగటి/రాత్రి) సెంటీగ్రేడ్‌లో
కొయ్యలగూడెం	28/13
చింతలపూడి	29/14
జంగారెడ్డిగూడెం	30/14
బుట్టాయిగూడెం	30/14
పోలవరం	30/14
భీమడోలు	30/14
దెందులూరు	30/14
నూజివీడు	29/14
ఏలూరు	30/14
భీమవరం	29/14
నరసాపురం	30/14
కుక్కునూరు	31/15
తాడేపల్లిగూడెం	31/15
నిడదవోలు	31/15
కొవ్వూరు	31/15
కైకలూరు	31/17
ఆకివీడు	31/17
తణుకు	30/17
పాలకొల్లు	29/20



పాఠశాలలో ప్రిన్సిపాల్ కోసం వేచి చూస్తున్న సీఐడీ బృందం

తడికలపూడి హర్షిత హైస్కూలు వద్ద హైడ్రామా

» ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకునేందుకు రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక బృందం

» సెక్యూరిటీ సిబ్బందితో స్వల్ప ఘర్షణ

» గదిలో తలుపువేసుకున్న ప్రిన్సిపాల్

కామవరపుకోట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):తడికలపూడి హర్షిత ఇంగ్లీ షు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ నందిగం రాణిని అదుపులోకి తీసుకు నేందుకు రాజమహేంద్రవరం నుంచి సీఐడీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో పది మంది బృందం సోమవారం పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బందికి, సీఐడీ బృందానికి కొద్దిపాటి ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం... హర్షిత స్కూలు ప్రిన్సిపాల్ నందిగం రాణిపై హైదరాబాదు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో 65 మంది తమను ప్రిన్సిపాల్ ఆన్‌లైన్ ద్వారా మోసం చేసి, రూ.33 కోట్లు నిధులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెను గత ఏడాది సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేయగా ఆమె కొంతకాలం జైలులో ఉండి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో సోమ వారం సీఐడీ బృందం రావడంతో ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకోవడానికి వచ్చారని విద్యార్థులు గ్రహించి, వారి ఎదుట నినాదాలు చేశారు. ఈ సందర్భంలోనే ప్రిన్సిపాల్ రాణి పాఠశాల పైఅంతస్తులో ఒక గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐడీ బృందం ఆమె వున్న గదికి వెళ్లి తలుపు తీయాలని నోటీసు ఇవ్వడానికి వచ్చామని చెప్పినప్పటికీ రాత్రి వరకు తలుపులు తీయలేదు. సీఐడీ బృందం అక్కడే కాపు కాసింది. గదిలో ఉన్న ప్రిన్సిపాల్ రాణి న్యాయవాదులతోను, ఆమె తరపు బంధువులతోను ఫోన్‌ల ద్వారా సంప్రదించారు. ఈ ఘటనతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందారు. ఆమెను అరెస్టు చేసి తీసుకువెళ్తే తమ పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సీఐడీ బృందం ఎదుట వాపోయారు. రాత్రి పొద్దు పోయిన తర్వాత గదిలో ఉన్న ప్రిన్సిపాల్‌కు సీఐడీ పోలీసులు కిటికీ ద్వారా నోటీసు ఇచ్చి తమ కార్యాలయానికి రావాలని చెప్పి వెనుదిరిగారు.





ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు

నేటి నుంచి శ్రీవారి తిరువీధి సేవలు



ద్వారకాతిరుమల, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ద్వారకాతిరుమలలో ధనుర్మాస ఉత్స వాలు సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానరాజ గోపురం మెట్లదారి మార్గంలో మహిళలు పూజాధికాలు జరిపారు. పాదుకామండపాన్ని, ధ్వజస్తంభ ప్రాంతాన్ని అరటిబోదెలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఆలయ మెట్లకు పసుపు, కుంకుమలు అద్ది బొట్లుపెట్టి హారతు లిచ్చారు. రంగవల్లులతో మెట్ల దారిని అలంక రించారు. నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్స వాలు క్షేత్రంలో నేత్రపర్వంగా జరుగనున్నా యని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ప్రతీ రోజూ శ్రీవారి తిరు వీధిసేవ జరుగుతుందన్నారు. ఆలయంలో సుప్రభాత సేవలకు మారుగా తిరుప్పావై సేవలు జరుగుతాయన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి

కలిదిండి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడినాడలో అపర భద్రాద్రిగా పేరొందిన సీతా రామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్స వాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సుప్ర భాత సేవ, తిరుప్పావై సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. స్వామివారి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆలయ ఈవో శేఖర్ శ్రీమన్నారాయణ గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి: చిన పూరిగా పేరుగాంచిన వడాలి సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తీర్థ బిందెతో పాటు స్వామికి విశేష అర్చనలు, తిరుప్పావై పూజలు నిర్వహించారు. ఈవో సింగనపల్లి శ్రీని వాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు జగన్నాథస్వామికి పూజలు, అర్చన నిర్వహించగా, పలువురు మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయంలో తొలిరోజు భక్తులు ధనుర్మాస పూజలు జరిపారు. గురజలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో కూడ ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

● కైకలూరు: మీసాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలను సోమ వారం ప్రారంభించారు. స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు. వికాస్ తరంగణి మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమా లను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

ముదినేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు పాల పొంగళ్లతో మొక్కుబడులను తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పిం చారు. నాగమల్లి చెట్టు వద్ద మహిళలు నాగ ప్రతిమలకు పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దంపతులు, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరరావు పూజలు చేశారు. ఆలయ ఏసీ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా రమేష్, వెనిగళ్ల సురేష్, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, రంగిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలో షష్టి ఉత్సవాల్లో పాలు పొంగళ్లు నిర్వహిస్తున్న మహిళలు



పోలవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

జగన్ తీరుతో పోలవరం ప్రాజెక్టుకు నష్టం జరిగింది

కైకలూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీరుతో పోలవరం ప్రాజెక్టుకు తీరని నష్టం జరిగిందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం పోలవరం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన కైకలూరులో విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లు ఏవిధమైన పనులు నిర్వహించక పోవడంతో ప్రాజెక్టుకు చాలా నష్టం జరిగిం దని కామినేని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి మరింత ఆలస్యం అవుతుందని, జగన్ తప్పి దం వల్ల ప్రాజెక్టు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించడంతో మరో రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. అనంతరం సీఎం సహాయ చెక్కులను పంపిణీ చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తైనందున గెలిచిన వారిని అభినందించారు. డీసీ చైర్మన్‌ల ఎంపికపై దృష్టి సారించి నియోజకవర్గంలోని నాయకులతో ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు.





వాడపల్లి, తాడినాడ రెవెన్యూ సదస్సుల్లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు

ముదినేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములపై సంపూర్ణ హక్కులు కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాస్ అన్నారు. వాడవల్లిలో తహసీల్దారు సుభానీతో కలిసి సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్య లకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభు త్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సబ్ డివిజన్ చేయించాలని, భూముల సరిహ ద్దుల సర్వే చేయించాలని కోరుతూ పలువురు రైతులు అర్జీలు అందజేశారు. సర్పంచ్ సూదా బత్తుల లక్ష్మీ పద్మావతి, నీటి సంఘం అధ్యక్షుడు సూదాబత్తుల సుధాకర్, దేవదాయ, శాఖ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు, వీఆర్వో కె.ఫణికు మార్, రైతులు పాల్గొన్నారు.

● కలిదిండి: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి బి.ప్ర బాకర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ సద స్సుల్లో భాగంగా తాడినాడ గ్రామసభ నిర్వహిం చారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరించాలన్నారు. భూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో అర్జీలు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ ఎం.షమీ, వీఆర్వో గంగాధర్ పాల్గొన్నారు.

పరుగు పందెంలో శ్రీనివాసరాజుకు బంగారు పతకాలు



ముదినేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13 నుంచి 15వరకు గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల పోటీల్లో పరుగు పెందెం విభాగంలో ముదినేపల్లి మండలం చిగురుకోట సెంటిని సిరామిక్స్ కంపెనీ జూనియర్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు బంగారు పతకాలను సాధించారు. ఈ పోటీల్లో 500 మీటర్లు, 1500 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందెంలో మూడు విభాగాల్లోనూ ఆయన ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్స్‌ను పొందారు. పరుగు పందాల్లో తన ప్రతిభను చూపిన శ్రీనివాసరాజును కంపెనీ యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

బంగారు పతకాలతో శ్రీనివాసరాజు



స్కూలుకి వెళ్లేదారిలో మురుగు నీరు..

చాట్రాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నంపేట గ్రామంలో శివపురం వెళ్ళేదారిలో ఇళ్ళలో వాడిన మురుగునీరు రోడ్డుపైకి వదిలి వేస్తుండటం వలన అపరిశు భ్రత తాండవిస్తున్నదని స్థానికులు అంటు న్నారు. ఆ దారిన పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారులకు వ్యాధులు ప్రబలు తాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. మురుగు సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

లచ్చన్న విగ్రహావిష్కరణకు అన్ని పార్టీలను పిలిచాం..

చాట్రాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో ఆదివారం జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు గౌడ సంఘం తరుపున అన్ని పార్టీల నాయకులను ఆహ్వా నించామని, ఇందులో మంత్రి పార్థసారథికి ఎటువంటి సంబంధం లేదని టీడీపీ గౌడ సంఘం నాయకులు పలగాని దుర్గారావు, మాదాసు చంద్రకళ, తల్లాడ శ్రీనివాసరావు, ఇజ్జిగాని నాగార్జున, మోదుగుమూడి రమేష్ అన్నారు. సోమవారం నాయకులు మాట్లా డుతూ గౌడ సంఘం ఆహ్వానం మేరకే వైసీపీ నుంచి జోగి రమేష్ వచ్చారని ఇది పార్టీ కార్య క్రమం కాదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

చాట్రాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి-చిన్నంపేట రహదారిలో తలా రులపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చీపురుగూడెం శివారు మర్రిబంధంకు చెందిన టీడీపీ కార్య కర్త తనగాల కాంతారావు (55) అక్కడికక్కడే మృతి చెందారు. వెలగలపల్లి అడ్డరోడ్డులో జరి గిన ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి వస్తూ బైక్ అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టడంతో చనిపోయాడు. చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలో సోమవారం జరి పిన దాడితో 20 లీటర్లు సారా, ద్విచక్రవా హనం స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. పారిపో యిన నిందితుడి గురించి విచారణ చేస్తున్నా మన్నారు దాడిలో ఏలూరు ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్ స్పెక్టర్ బోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

నూజివీడు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలను చెల్లించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐసీ టీయు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నూజి వీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ పాఠశాలలో పారి శుధ్య కార్మికులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీతాలు చెల్లించలేదని, ఎండీఎం కార్మికులకు గత ప్రభుత్వం రూ.3 వేలు ఇవ్వగా కూటమి ప్రభుత్వం రూ.2 వేలు చెల్లించడం దారుణమన్నారు. కనీస వేతన రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్, వేముల బక్కయ్య పరికల కళావతి, ఆనందరావు పాల్గొన్నారు.

చాట్రాయి :మధ్యాహ్న భోజనం వంట కార్మి కుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయుసీ రాష్ట్ర నాయకులు మర్పకట్ల త్యాగ రాజు, చాట్ల బాబూరావు సోమవారం ఎంఈవో బ్రహ్మచారికి వినతిపత్రం అందజేశారు. చాలీచా లని మెస్ చార్జీల వల్ల ఇబ్బందులు పడుతున్నా రని, ఇటీవల ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు ధరలకు అను గుణంగా లేవన్నారు. 1 నుంచి 5 వరకు రూ.15, 6 నుంచి 10 వరకు రూ.20 మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉచి తంగా వంట గ్యాస్ సరఫరా చెయ్యాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన



నూజివీడు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించా లంటూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు బద్దా వెంకట్రావ్, మానికల నాగరాజులు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జిల పేరుతో ప్రజలపై మోపిన 18 వేల కోట్ల భారాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని కోరారు. రమేష్, అమ్ములు, దేవుడు, సాయి పాల్గొన్నారు.

క్యాంపెస్ సెలక్షన్స్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



నూజివీడు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ మెటలర్జీ విభాగానికి చెందిన విద్యార్థులు కేసీపీ ఇంజనీర్స్ ప్రై.లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మెటలర్జీ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపిక కాగా వారిని ఆయన అభినందించారు. గత కొనేళ్లుగా మెటలర్జీ విభాగం ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. హెచ్.వో.డి బి.వెంకటేశ్వర్లు, ప్రొపెసర్ వీర శ్రీను, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో ధనుర్మాస పూజలు

ముసునూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న వైష్ణవాలయాల్లో ధను ర్మాస పూజలు సోమవారం వైభవంగా ప్రారం భమయ్యాయి. ముసునూరు శ్రీ భూదేవి శ్రీదేవి సమేత వెంకటాచల స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీ నారసింహచార్యులు ధనుర్మాస పూజలకు అంకురార్పణ చేశారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించగా, వెంకటేశ్వర తాళం భజన బృందం అమ్మవారి సహస్రనామావళి, తిరుప్పావై భక్తి శ్రద్ధలతో ఆలపించారు. ఆలయ చైర్మన్ దేవినేని సత్య వరప్రసాదరావు పూజల్లో పాల్గొన్నారు. గోగులంపాడు, చెక్కపల్లి, గోపవరం, రమ ణక్క పేట, చింతలవల్లి తదితర గ్రామాల్లో కోదండ రామాలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభ మయ్యాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోదాదేవికి విశేష పూజలు చేశారు.



ముసునూరులో ప్రత్యేక అలంకరణలో వెంకటాచలస్వామి

నేటి నుంచి గంగానమ్మ జాతర



ముదినేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెద గొన్నూరులో గంగాన మ్మ జాతర మంగళ వారం నుంచి ప్రారం భం కానుంది. ఈ ఈ నెల 21 వరకు జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17 రాత్రి పోలి మెర్ల అనకట్టడం, 18న అమ్మవారికి పుట్టింటి నుంచి పసుపు, కుంకుమలు తీసుకురావటం, 19న గంగానమ్మ, పోతురాజుల చలువ కుండ ల ఊరేగింపు, 20న వసంతోత్సవం, 21న జాతర మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు తెలిపారు. ఆచార సాంప్రదాయాల ప్రకారం గంగానమ్మ, పోతురాజుల జాతర నిర్వహణకు గ్రామస్థులు కూడ సిద్ధమవుతున్నారు.

శెట్టిబలిజ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగముని

మండవల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ స్థాయిలో శెట్టిబలిజ నూతన కార్యవర్గాన్ని పులపర్రు గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లా శెట్టిబలిజ సంఘ అధ్యక్షులు కోడి దుర్గారావు అధ్యక్షతన శెట్టి బలిజ సంఘం కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా మామిడిశెట్టి నాగముని, గౌరవ అధ్యక్షులుగా కడలి శ్రీనివాస్, గౌరవ ఉపాధ్య క్షులుగా పెచ్చెట్టి శ్యామలరావు, కాండ్రేకుల నాగరాజు, జనరల్ సెక్రటరీ బొంతు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ వీరవల్లి వీరాస్వామి, ట్రెజరర్ జోగికుమార్ మరియు 8 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడుగా నగేష్‌బాబు



మండవల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడి గా మండవల్లికి చెందిన దొడ్డాకుల నగేష్‌బాబును ఎన్నికల చేసినట్లుగా ఆసుపత్రి బోర్డు చైర్మన్, సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి సోమవారం వెల్లడించారు. గడిచిన 13 సంవత్సరాలలో ఇరు తెలుగు రాష్ట్రాలలో వేల మంది కార్మికులకు ఈఎస్ఐ ద్వారా చేకూరే వివిధ ప్రయోజనాలను అందివ్వడంలో అవగాహన సదస్సులు, ఆరోగ్య క్యాంపులు నిర్వహించి కార్మికుల అభ్యున్నతికి పాటు పడ్డారని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 17న జరగనున్న బోర్డు సమావేశానికి రావాల్సిందిగా నియామక ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు.



పోలవరం రెవెన్యూ సదస్సులో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్

భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

చాట్రాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభు త్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రశాంతి కోరారు. పోలవరం సచివాల యంలో సోమవారం జరిగిన రెవెన్యూ సద స్సులో సర్వే కోసం 2, పట్టాదారు పాసుపుస్త కాల కోసం 6 మొత్తం 8 అర్జీలు వచ్చాయి. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రాజు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న డీటీ రమణ

గుళ్ళపూడిలో..

ముసునూరు, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తోందని డిప్యూటీ తహ సీల్దార్ కె.వి రమణ అన్నారు. సోమవారం గుళ్ళపూడిలో జరిగిన గ్రామసభలో పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. భూ సమస్యలపై 38 అర్జీలు రాగా, సభలో మూడు అర్జీలను పరిష్కరిం చామని తెలిపారు. వీఆర్వో శారద, వీఆర్‌ఏ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలు, అనాథలకు దుస్తులు పంపిణీ

చాట్రాయి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడు కల్లో 60 మంది పేద మహిళలకు, 6 గురు అనాదలకు, 120 మంది పాస్టర్లకు న్యూలైఫ్ ఇండియా మిషన్స్ వ్యవస్థాపకుడె రత్నరాజు సహకారంతో దుస్తులు పంపిణీ చేశారు.

స్థానిక పాలనపై నేడు శిక్షణ

ముసునూరు, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణపై శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. మండ లస్థాయి అధికారులు, సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఎంపిడివో కోరారు.